సాక్షి
కామారెడ్డి
బుధవారం । 27 । నవంబర్ । 2024



తాగునీటి ఇబ్బందులు

గుల్లతండాలో బోరు మోటారు చెడిపోయినా మరమ్మతులు చేయించకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

- 9లో ▸



పాఠశాల రాజ్యాంగం..

నస్రుల్లాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వారం పాటు శ్రమించి పాఠశాల రాజ్యాంగాన్ని రచించారు.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.9 /10.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కొత్త మండలాలకు ఎంపీపీ కార్యాలయాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కొత్తగా ఏర్పాటైన మండలాలలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 12 పంచాయతీలలో పాల్వంచ, 13 పంచాయతీలతో డోంగ్లీ, 13 పంచాయతీలతో మహమ్మద్నగర్ మండలాలు ఏర్పాటైన విషయం తెలిసిందే. ఆయా మండలాలలో ఇప్పటివరకు తహసీల్దార్ కార్యాలయాలు మాత్రమే ఉన్నాయి. ఇటీవలే మండల విద్యాశాఖ అధికారులను కేటాయించారు. తాజాగా మండల ప్రజాపరిషత్లు కూడా ఏర్పాటు చేస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. మూడు కొత్త మండలాలలో పోలీస్ స్టేషన్లు ఏర్పాటు కావాల్సి ఉంది.

జిల్లా కేంద్రంలో మహిళా శక్తి భవనం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మహిళలను పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకానికి రూపకల్పన చేసింది. అందులో భాగంగా అన్ని జిల్లాల్లో ఇందిర మహిళా శక్తి భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. జిల్లా కేంద్రంలో రూ.5 కోట్ల వ్యయంతో ఎకరం విస్తీర్ణంలో ఆధునిక హంగులతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు.

'చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి'



నిజాంసాగర్/ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మోడల్ స్కూల్స్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఏఎంవో రవి కుమార్‌లతో కలిసి ఎల్లారెడ్డి పట్టణంతో పాటు నిజాంసాగర్ మండలం అచ్చంపేటలోని మోడల్ స్కూల్స్‌ను సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి బాగా చదవాలని సూచించారు. అచ్చంపేటలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వారి వెంట ఎల్లారెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ గాంధీ, వైస్ ప్రిన్సిపల్ జహంగీర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, ప్రియదర్శిని, విద్యారమణ, బల్వంత్‌రావు, వార్డెన్ సుజాత, మహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల ఎంఈవోలు అమర్‌సింగ్, తిరుపతిరెడ్డి, అచ్చంపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కార్తీక సంధ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు



ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లకు ఆర్‌ఎం జానీరెడ్డి మంగళవారం నగరంలోని డిపో–1లో ప్రగతి చక్రం పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ వి శంకర్, అకౌంట్స్ ఆఫీసర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు తప్పల్లేకుండా నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి




భిక్కనూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి రజిత, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి తదితరులున్నారు.

బంధాలకు బీటలు!

- ఇంటింటా ఆస్తుల కొట్లాటలు
- కన్నవాళ్లు, తోబుట్టువులతో పంచాయితీలు
- పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతున్న వైనం
- భూముల ధరలకు రెక్కలు రావడమే కారణం

ఆస్తుల గొడవలతో అను'బంధా'లకు బీటలు వారుతున్నాయి. తండ్రీకొడుకులు, తండ్రీకూతుళ్లు, అన్నాదమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లు... ఇలా అయినవారే కొట్లాటలకు దిగుతున్నారు. ఆవేశంలో దాడులు చేసుకుని పోలీసు స్టేషన్ గడప తొక్కుతున్నారు. కొన్ని సందర్భాల్లో దారుణాలకూ పాల్పడుతున్నారు. దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: అభివృద్ధి, పట్టణీకరణలతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. మారుమూల గ్రామాల్లో సైతం ఎకరం భూమి రూ. 20 లక్షలకు తక్కువ దొరికే పరిస్థితి లేదు. పట్టణాలకు చుట్టుపక్కల అయితే ఎకరానికి రూ.2 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ధర పలుకుతోంది. జాతీయ రహదారుల వెంట రూ. 50 లక్షల నుంచి రూ. 2 కోట్ల దాకా ధర నడుస్తోంది. ఇటీవలి కాలంలో భూముల క్రయవిక్రయాలు తగ్గిపోయినా భూముల ధరలు మాత్రం తగ్గడం లేదు.

అమ్మిన భూములపైనా కేసులు..

చాలాచోట్ల అమ్ముకున్న భూములను తెల్ల కాగితం మీదో, బాండు పేపర్ మీదో విక్రయ పత్రం రాయించుకుంటారు. తెలిసీతెలియక చాలామంది రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడం, రిజిస్ట్రేషన్ చేయించుకున్నా రికార్డుల్లో నమోదు చేయించకపోవడంతో అమ్మిన వారి పేరుతోనే భూముల వివరాలు ఉండిపోతున్నాయి. ధరణి వచ్చిన తర్వాత ఇది బయటపడింది. ఎప్పుడో అమ్ముకున్న వారి పేరిటనే భూముల రికార్డులు ఉండడంతో పాత పట్టాదారు సంతానం రంగ ప్రవేశం చేసి ఆ భూమి తమదేనంటూ గొడవలకు దిగుతున్నారు. ఆ భూమి అమ్మలేదని కొందరు, అమ్మిన సమయంలో తాము మైనర్లమని, తమకు తెలియకుండా అమ్మారని, పత్రాలపై తమ సంతకాలు లేవని చెబుతూ కేసులు వేస్తున్నారు.

ఆడబిడ్డలదీ అదే దారి..

ఆడబిడ్డలు సైతం కన్నవారి ఆస్తిలో వాటా కోరుతున్నారు. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చామంటూ తోడబుట్టినవారితో పాటు కన్నవారు కూడా ఆస్తిలో వాటా ఇవ్వడానికి వెనకడుగు వేస్తున్నారు. ఇలాంటి సమయంలో కొందరు ఆడపిల్లలు తమ తండ్రి ఆస్తిలో వాటా కోసం కేసులు వేస్తున్నారు. మరికొందరు తండ్రి పేరుతో ఉన్న ఆస్తిని అమ్ముకున్నపుడు అందులో వాటా ఇవ్వాల్సిందేనంటున్నారు. లేదంటే అమ్మకాలు జరగకుండా అడ్డుపడుతున్నారు. అయితే కొందరు ఆస్తిలో వాటాకు బదులుగా ఎంతోకొంత ఇచ్చి కొట్లాట లేకుండా చూసుకుంటుండగా.. మరికొందరు ఆడబిడ్డకు ఇచ్చేదేమీ లేదంటూ గొడవలకు దిగుతున్నారు.

ఆస్తుల పంపకం కోసం..

ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. వివాహం కాగానే వేరు కాపురం పెడుతున్నారు. దీంతో ఇల్లు, భూములు, ప్లాట్ల విషయంలో కుటుంబంలో ఆస్తుల పంచాయితీ మొదలవుతోంది. ఇలా మొదలైన పంచాయతీలు నెలల తరబడి తెగనివి ఎన్నో ఉంటున్నాయి. పంచాయితీ కొలిక్కి వచ్చేసరికి ఇరువురి ఆస్తులు హారతి కర్పూరంలో కరిగిపోతున్న ఉదంతాలూ ఉన్నాయి. జిల్లాకేంద్రంలో గజాల భూమి కోసం అన్నదమ్ములు కొట్లాడి పంచాయతీకి లక్షల రూపాయలు ఖర్చు చేసిన ఉదాహరణలున్నాయి. ఇల్లు, భూముల విషయంలో పలువురు అన్నాదమ్ములు ఇలాగే కొట్లాడుకుంటున్నారు. ఒక్కోసారి ఆవేశానికి లోనై కొట్లాడుకుని పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతున్నవారూ ఉన్నారు. మరికొన్ని చోట్ల ఆస్తుల వివాదంలో కోర్టులో కేసులు వేసుకుంటున్నారు.

హత్యలకు దారితీస్తున్న ఆస్తి తగాదాలు

కుటుంబ ఆస్తుల విషయంలో అన్నదమ్ములు, తండ్రీకొడుకులు, అన్నాచెల్లెళ్ల మధ్య గొడవలు పెరిగి హత్యాయత్నాలు, హత్యలకూ దారితీస్తున్నాయి. జిల్లాలో ఇటీవలి కాలంలో జరిగిన పలు హత్య కేసుల్లో భూ వివాదాలే కారణమని స్పష్టమైంది. ఓ గ్రామంలో వదిన(అన్న భార్య)ను మరిది హత్య చేసిన కేసులో భూమి వివాదమే కారణమని తేలింది. మరో గ్రామంలో అన్నను తమ్ముడు హత్య చేయడం, ఇంకోచోట తండ్రిని కొడుకు హతమార్చినది కూడా ఆస్తి తగాదాల వల్లేనని వెల్లడైంది. ఆస్తుల గొడవల్లో దాడులు చేసుకోవడం, హత్యలు జరగడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. హతులు, హంతకులు ఒకే కుటుంబం, ఒకే రక్తం పంచుకు పుట్టిన వారే అవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

వణికిస్తున్న చలి

- రోజురోజుకు పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- చలిగాలులతో ఇబ్బందిపడుతున్న జనం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో వారం రోజులుగా చలి వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలవుతోంది. ఉదయం 9 దాటినా చలి వీడడం లేదు. పగటిపూట కూడా చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు చలిగాలులు వీస్తుండడంతో చాలా మంది జలుబు, దగ్గు, జ్వరాలతో మంచం పడుతున్నారు. జిల్లాలో నస్రుల్లాబాద్ మండలం బొమ్మదేవ్‌పల్లి, గాంధారి మండల కేంద్రం, మద్నూర్ మండలం మేనూర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10.8 డిగ్రీలకు పడిపోయాయి. గాంధారి మండలం సర్వాపూర్, రామలక్ష్మణపల్లి, జుక్కల్ మండల కేంద్రంలో 10.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాల్వంచ మండలం ఎల్పుగొండలో 11 డిగ్రీలు, రామారెడ్డిలో 11.3, దోమకొండ, లచ్చాపేటలలో 11.4, లింగంపేట, బీర్కూర్, ఇసాయిపేట, బిచ్కుందలలో 11.5, బీబీపేట, పుల్కల్‌లో 11.6, పిట్లం, మాచాపూర్‌లలో 11.7, నస్రుల్లాబాద్‌లో 11.9, అర్గొండలో 12, నాగిరెడ్డిపేటలో 12.2, డోంగ్లీ, నిజాంసాగర్‌లలో 12.4, పాతరాజంపేటలో 12.6, కొల్లూరులో 12.7, పెద్దకొడపగల్‌లో 13, తాడ్వాయిలో 13.4, భిక్కనూరు, సోమూర్‌లలో 14.1, సదాశివనగర్‌లో 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి

- కాంగ్రెస్ జరపాల్సింది అపజయోత్సవాలు
- బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

కామారెడ్డి క్రైం: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన నవంబర్ 29న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నూటికి సున్నా శాతం పాలన నడుస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలన నుంచి విముక్తి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసుకోవాల్సింది విజయోత్సవాలు కాదని, ప్రజలను మోసం చేసినందుకు అపజయోత్సవాలు జరుపుకోవాలని పేర్కొన్నారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో 2009 నవంబర్ 29న కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు. కేసీఆర్ దీక్షకు సిద్ధపడిన రోజును ఏటా దీక్షా దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈనెల 29 న కామారెడ్డిలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ సింధే, జాజాల సురేందర్, నాయకులు సుమిత్రానంద్, పిప్పిరి ఆంజనేయులు, గోపీ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. మిల్లులకు పంపే సమయంలో ఏ రకం బియ్యం పంపిస్తున్నామో స్పష్టత ఉండాలని సీఎం సూచించారు. సూచించిన సమయంలో ధాన్యం మిల్లింగ్ చేసి ఇవ్వని మిలర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

ట్యాబ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయండి

ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాల ట్యాబ్ ఎంట్రీని త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సన్న వడ్లు విక్రయించిన రైతులకు బోనస్ చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లానుంచి అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వి.విక్టర్, ఆర్డీవో రంగనాథ్రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలి'



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన నవోదయ విద్యాలయంలో సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. వెల్గనూర్, అచ్చంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎంట్రీకి సంబంధించి నిరుద్యోగ యువత సేవలను వాడుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్‌రావు, అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ భిక్షపతి, సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నవోదయలో రాజ్యాంగ దినోత్సవం..

నిజాంసాగర్: భారత రాజ్యాంగం గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్‌రావు, మండల ప్రత్యేకాధికారి శ్రీపతి, నవోదయ ప్రిన్సిపల్ సత్యవతి, ఎంఈవోలు అమర్‌సింగ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊర కుక్కల వీరంగం

నగరంలో స్కూలు విద్యార్థులు, ఎడపల్లి మండలంలో గ్రామస్తులపై దాడి

నిజామాబాద్ సిటీ/ఎడపల్లి(బోధన్) : నిజామాబాద్ నగరం, ఎడపల్లి మండలంలో మంగళవారం వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. నగరంలోని పాతబస్తీలోని అహ్మద్‌పుర కాలనీ, మాలపల్లి మధ్యలో నాలుగు కుక్కలు పిచ్చిపట్టినట్లుగా స్కూలు పిల్లలపై ఒక్కసారిగా దాడి చేశాయి. అడ్డు వెళ్లిన స్థానికులు ఇద్దరిని కుక్కలు గాయపరిచాయి. స్కూలు పిల్లలు ఎండీ తఖీఫ్, సోఫియా ఖాన్, అబ్దుల్ ఫసీ, ఉజ్మా, ఖాజా, షహీద్, అల్మాస్ కుక్కల దాడిలో తీవ్ర గాయాల పాలయ్యారు. కాళ్లు, చేతులు, తొడలు, కంటి భాగంపైన విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయపడిన పిల్లలను తల్లిదండ్రులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బల్దియా అధికారులు వీధి కుక్కలను నివారించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎడపల్లి మండలంలోని దుబ్బ తండా గ్రామంలో ముగ్గురు, ఏఆర్పీ క్యాంపు గ్రామంలో ఇద్దరు వీధి కుక్కలు దాడిలో గాయపడ్డారు. ఏఆర్‌పీ క్యాంపు గ్రామంలో బాలిక తీవ్రంగా గాయపడింది.

ఆర్థికంగా బలోపేతం కావాలి



భూమి పూజ చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

లింగంపేట: మహిళా సంఘాల సభ్యులు వ్యాపారంలో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండల సమాఖ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. క్యాంటీన్, డెయిరీ, ఫిష్‌పాండ్ తదితర వ్యాపారాలు చేయాలని సూచించారు. మండలకేంద్రంలో రూఫ్‌టాప్ రెయిన్ వాటర్, హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. మండలంలో కొత్త గ్రూపులను ఏర్పాటు చేస్తున్నామని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సులోచన తెలిపారు. పిండి గిర్ని, నాటు కోళ్లు, డెయిరీ, క్యాంటీన్ వంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ నరేందర్, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీవో మలహరి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యలో గుణాత్మక మార్పులు తేవాలి



డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి రూరల్: డిజిటల్ టెక్నాలజీతో విద్యలో గుణాత్మక మార్పులు తేవడం ముఖ్యమని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం క్యాసంపల్లి ప్రైమరీ స్కూల్‌లో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా కంటెంట్‌ను రూపొందించారని, ఇది వారి ఆసక్తిని పెంపొందించి, జ్ఞానాన్ని విస్తరించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

కామారెడ్డి టౌన్: ప్రతి పౌరుడికి రాజ్యాంగంపై పూర్తి అవగాహన ఉండాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర గొప్పదన్నారు. ప్రధాని మోదీ హయాంలోనే రాజ్యాంగానికి, అంబేడ్కర్‌కు పూర్తి గౌరవం దక్కాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీకాంత్, శ్రీనివాస్, నరేందర్, నాయకులు సురేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తా

- శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి



శంకుస్థాపన చేస్తున్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, వీసీ యాదగిరిరావు

భిక్కనూరు: భిక్కనూరులోని సౌత్ క్యాంపస్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి పేర్కొన్నారు. ఆయన తన సొంత డబ్బులతో సౌత్‌క్యాంపస్‌లో బహిరంగ వేదిక నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ క్యాంపస్‌లో స్నాతకోత్సవం జరుగుతున్న శుభతరుణంలో బహిరంగ వేదిక లేదని తెలుసుకుని దాని నిర్మాణానికి ముందుకు వచ్చానన్నారు. ఆడిటోరియం నిర్మాణంతోపాటు న్యాక్ గుర్తింపు కోసం జరిగే అన్ని కార్యక్రమాలకు తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. సౌత్‌క్యాంపస్‌ను యూనివర్సిటీగా మార్చేందుకు కృషిచేస్తానన్నారు. బహిరంగ వేదిక నిర్మాణానికి ముందుకు వచ్చిన ఎల్లారెడ్డికి తెయూ వైస్‌చాన్స్‌లర్ యాదగిరిరావు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన క్యాంపస్ మాదిరిగా సౌత్ క్యాంపస్ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, అధ్యాపకులు యాలాద్రి, సునీత, లలిత, హరిత, నారాయణ, నాగరాజు సరిత, మోహన్‌బాబు, నాగిరెడ్డిపేట మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీహరి రాజు మంగళవారం బాధ్యతలను చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు కమిషనర్‌కు స్వాగతం పలికి సత్కరించారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సానిటరీ ఎస్సై పర్వేజ్, కార్మిక సంఘాల నాయకులున్నారు.

చైర్‌పర్సన్‌ను కలిసిన కమిషనర్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించిన ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు మంగళవారం చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. కౌన్సిలర్లు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వంశీ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పరీక్షలను తనిఖీ చేసిన వైస్ చాన్స్‌లర్



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం.యాదగిరిలు మంగళవారం తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ సాయిబాబాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

'కాలువకు మరమ్మతులు చేయిస్తా'



కామారెడ్డి టౌన్: టీచర్స్ కాలనీలో కూలిపోయిన మురికి కాలువకు మరమ్మతులు చేయిస్తానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే, టీచర్స్ కాలనీలో పర్యటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

గుండెపోటుతో మీ-సేవ నిర్వాహకుడి మృతి


బీసు రవి(ఫైల్)

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన మీ-సేవ నిర్వాహకుడు బీసు రవి (55) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. అంత్యక్రియల్లో సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక నాగరాజు, మాజీ ఎంపీపీ కానుగంటి శారద, మాజీ సర్పంచ్ నల్లవు శ్రీనివాస్, మీ-సేవ నిర్వాహకులు పాల్గొన్నారు.


తాడ్వాయిలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు


లింగంపేటలో.. మండల ప్రత్యేకాధికారి సురేందర్


నస్రుల్లాబాద్: మినీ గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో చందర్ నాయక్

రుచికరమైన భోజనం పెట్టాలి


బీబీపేట కేజీబీవీలో ..

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా, మోడల్, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలను మంగళవారం తనిఖీ చేశారు. వంట గదులు, వండడానికి తెచ్చిన కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఏమేమి సమస్యలు ఎదుర్కొంటున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరై విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతులలో పాఠాలను బోధించాలని చెప్పారు. రికార్డులను పరిశీలించారు. – సాక్షి నెట్‌వర్క్


బాన్సువాడలో.. ప్రత్యేక అధికారి దయానంద్


ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేందర్‌కుమార్


పిట్లం బాలికల వసతి గృహంలో వంట గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్


కామారెడ్డి మైనారిటీ జూనియర్ కళాశాలలో వంటలను పరిశీలిస్తున్న ఎంఈవో ఎల్లయ్య


వంటలను పరిశీలిస్తున్న బాన్సువాడ ఎంపీడీవో


జంగంపల్లి గురుకుల పాఠశాలలో.. ఎంఈవో రాజగంగారెడ్డి


రాజంపేట కేజీబీవీలో విద్యార్థుల ప్రగతి వివరాలను పరిశీలిస్తున్న అధికారులు


నాగిరెడ్డిపేట కస్తూర్బాలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి రత్నం


నిజాంసాగర్ కస్తూర్బాలో తరగతి గదులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్రీపతి

జాతీయ స్థాయి హాకీ పోటీలకు మాచారెడ్డి విద్యార్థిని

మాచారెడ్డి: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న శ్రావ్య జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 26 నుంచి డిసెంబర్ 6 వరకు హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్ర జట్టు నుంచి శ్రావ్య ఆడనున్నట్లు ప్రిన్సిపాల్ యాకినొద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు శ్రావ్యను అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు..

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండల కేంద్రంలోని సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థులు గుగులోత్ అక్షర, అక్షిత్‌లు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ తెలిపారు.


శ్రావ్య, ఎంపికైన సెయింట్ జాన్స్ విద్యార్థులు

డాటా ఎంట్రీలో తప్పులు ఉండొద్దు



బీబీపేట: కుటుంబ సర్వేలోని వివరాలను ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా పొందుపర్చాలని మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఎంట్రీని పరిశీలించారు. మండల వ్యాప్తంగా మంగళవారం 557 కుటుంబాల వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ ఉన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలి

రాజంపేట: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని మండల తహసీల్దార్ అనిల్ కుమార్ సూచించారు. మంగళవారం కొండాపూర్ క్లస్టర్‌లో విశ్వజ్యోతి గ్రామ సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు మరుగుదొడ్లని వినియోగించుకోవాలని సూచించారు. అదే విధంగా 18సంవత్సరాలు నిండినవారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామ సంఘం కోశాధికారి కె.సంగమణి, చిన్న సంఘాల లీడర్లు, సీసీ భాగయ్య, వీవోఏ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ అనిల్

మొరం టిప్పర్లకు జరిమానా

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గోపన్‌పల్లి శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లను తహసీల్దార్ సురేశ్ మంగళవారం పట్టుకున్నారు. మొరం తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని అధికారులకు సమాచా రం అందించారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

మాక్ అసెంబ్లీ నిర్వహించడం అభినందనీయం


గాంధారి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్


వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్, అధికారులు

● అదనపు కలెక్టర్ విక్టర్

గాంధారి(ఎల్లారెడ్డి): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించడం అభినందనీయమనిఅదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధారి మండలంలో పర్యటించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విక్టర్ హాజరయ్యారు. జెడ్పీ సీఈవో చందర్, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఈవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోళ్ల పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): అదనపు కలెక్టర్ విక్టర్, జెడ్పీ సీఈవో చందర్, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీ ప్రసన్న మంగళవారం మండలంలో పర్యటించారు. అదనపు కలెక్టర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు విధానాన్ని సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, మండల పరిషత్ కార్యాలయంలో సర్వే డాటా ఎంట్రీని పరిశీలించారు. తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, డీటీ రవి పాల్గొన్నారు.

'పారదర్శకంగానే ఎన్నికలు నిర్వహిస్తున్నారు'

మద్నూర్(జుక్కల్): ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగి వరకు వ్యవస్థపై నమ్మకంతో ఎంతో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, కామారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేశారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మంగళవారం అదనపు కలెక్టర్ మాట్లాడారు. పేపర్ బ్యాలెట్‌తోనే ఎన్నికలు నిర్వహించాలని వేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు కొట్టేసిందన్నారు. ఈవీఎంల విశ్వసనీయతపై ప్రశ్నించే వారి అస్థిరతను ఎత్తిచూపిందని తెలిపారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ ముజీబ్ ఉన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: యువత రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిజామాబాద్ ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవంలో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలు రూపొందించిందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం చాలా గొప్పదని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం వాటిల్లితే పౌరులు కోర్టుల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి కంఠేశ్వర్ వరకు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీబీసీ ఎఫ్‌పీవో ధర్మానాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి నరేశ్, తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవీంద్రరెడ్డి, జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్, ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్ దాస్, శరత్, అధ్యాపకులు బి రామచంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపిక

మాక్లూర్: నిజామాబాద్ నగర శివారులోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థిని వై ప్రజ్ఞ జూనియర్ విభాగంలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపికై ంది. ఇటీవల మెదక్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ప్రజ్ఞ ఉత్తమ ప్రతిభకనబర్చింది. హెచ్ఎం ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో ప్రజ్ఞతోపాటు ఉపాధ్యాయులు మంగళవారం బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డిని కలువగా ఆయన అభినందించారు. డిసెంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి టోర్నీలో ప్రజ్ఞ పాల్గొననుందని ప్రసన్నకుమారి తెలిపారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజ్ఞను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ముగిసిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

నిజామాబాద్ నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నాగారంలోని రాజారం స్టేడియంలో నిర్వహించిన అండర్ – 8, 10, 12 బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రస్మా జిల్లా సలహాదారు మామిడాల మోహన్, అధ్యక్షుడు నిత్యానంద్ హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అండర్ – 8 బాలికల విభాగంలో జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను విజయ పబ్లిక్ స్కూల్ (నిజామాబాద్), బాలుర విభాగంలో నియో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ (నందిపేట్) కైవసం చేసుకున్నాయి. అండర్ –10 బాలుర విభాగంలో విజయ హై స్కూల్, బాలికల విభాగంలో హంస వాహిని హై స్కూల్ (ధర్పల్లి) చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి.అండర్ – 12 బాలుర విభాగంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (ఆర్మూర్), బాలికల విభాగంలో విశ్వ వికాస్ హై స్కూల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నాయి. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రత్నాకర్ నరాల, రాజాగౌడ్, ప్రధాన కార్యదర్శి అరుణ్, ట్రస్మా పట్టణ అధ్యక్షుడు ధర్మరాజు, విశ్వవికాస్ కరస్పాండెంట్ వంశీకృష్ణ, హంసవాహిని కరస్పాండెంట్ మాన్‌సింగ్, విద్యా హైస్కూల్ కరస్పాండెంట్ సందీప్, శ్రీమేధా కరస్పాండెంట్ దత్తు, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నందిపేట్ నియో లిటిల్ ఫ్లవర్ క్రీడాకారులు..

మక్కజొన్న జూడులు దగ్ధం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేమికలాన్ శివారులో మంగళవారం తాడ్వాయికి చెందిన గైని చంద్రంకు సంబంధించి మక్కజొన్న జూడులు దగ్ధమై రూ.30వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. జూడులపై విద్యుత్ వైర్లు పడడంతో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. కామారెడ్డి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను చల్లార్చింది. ప్రభుత్వం తనకు నష్టపరిహారం ఇవ్వాలని బాధితుడు కోరాడు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ డీఎస్పీ మదన గంగాధర్ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో కొనసాగుతున్న 46వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ మహిళా హ్యాండ్ బాల్ క్రీడా పోటీల ఉమ్మడి జిల్లా జట్టు శిక్షణ శిబిరాన్ని వారు సందర్శించారు. ఉత్తమ ప్రతిభకనబర్చి భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా ఎదగాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, పీఈటీలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురి మృతి

విద్యుత్ షాక్‌తో ఒకరు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన పట్నం సిద్ధిరాములు(49)అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన చిట్యాల కృష్ణారెడ్డి వ్యవసాయ భూముల్లో చెట్లు కొడుతుండగా విద్యుత్‌షాక్ తగిలింది.వెంటనే సిద్ధిరాములును కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిస్థితి విషమించి..

మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన బూస బాల్‌రాజు(46) ఈ నెల 4న దాబా పై నుంచి పడి గాయపడ్డాడు. ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి...

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. సుమారు 50 ఏళ్ల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందన్నారు. మృతుడి ఒంటిపై బ్లాకలర్ ప్యాంట్ ఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి సంబంధీకులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు..


అజయ్(ఫైల్)

నిజామాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాలూర్‌గ్రామానికి చెందిన అజయ్(24) సోమవారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాలూర్‌కు చెందిన అజయ్ గత శుక్రవారం నగరానికి చెందిన తన స్నేహితుడి ఇంట్లో శుభకార్యానికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా ఖానాపూర్ శివారులో కుక్కలు బైక్‌కు అడ్డువచ్చాయి. దీంతో అజయ్ పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభానికి ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. బాధితుడిని హైదరాబాద్‌కు తరలించగా, అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఒకరి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పూలాంగ్‌కు చెందిన సిరపత్ నరేశ్(55) అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఔరంగాబాద్‌కు చెందిన సిరపత్ నరేశ్ కుటుంబ సభ్యులతో కలిసి రెండేళ్ల క్రితం నగరానికి వచ్చి పూలాంగ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, ఈనెల 24న ఇంట్లో నుంచి వెళ్లిన నరేశ్ తిరిగి రాలేదన్నారు. కుటుంబసభ్యులు పలుచోట్లు వెతికి నా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య రమ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వేధించిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్య ఆరోగ్యంపై ఆందోళనతో ఆత్మహత్య

ఎడపల్లి(బోధన్): భార్య ఆరోగ్యంపై ఆందోళనతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జంలం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

గ్రామానికి చెందిన సాయిలు(52) భార్య మీన అనారోగ్యంతో బాధపడుతున్న మెంట్రాజ్‌పల్లిలోని తన చెల్లెలి ఇంటికి వెళ్లి నెలరోజులుగా అక్కడే ఉంటోంది. దీంతో సాయి లు తన భార్య ఆరోగ్యంపై ఆందోళనతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్‌రెడ్డి తెలిపారు.

డిచ్‌పల్లిలో చోరీ

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న మణికంఠ లక్ష్మీనర్సయ్య అనే వ్యక్తి ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. లక్ష్మీనర్సయ్య దంపతులు ఊరికి వెళ్లగా వారి పెద్ద కుమారుడు పైపోర్షన్‌కు తాళం వేసి కింది పోర్షన్ లో నిద్రించాడు. అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు రూ.2వేల నగదు, మొబైల్ ఫోన్, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఇందల్వాయి: ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కొటాల్‌పల్లి బీట్ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ని మంగళవారం సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్‌వో రవి మోహన్‌భట్ తెలిపారు. అనుమతులు లేకుండా అటవీప్రాంతంలో పనులు చేపట్టినా, ఇసుక తరలించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.